సాక్షి
అల్లూరి సీతారామరాజు జిల్లా

గురువారం । 1 । ఫిబ్రవరి । 2024



రాష్ట్రస్థాయిలో సత్తా చాటాలి

ఆడుదాం ఆంధ్రా పోటీల్లో రాష్ట్ర స్థాయిలో సత్తా చాటాలని కలెక్టర్ సుమిత్‌కుమార్ ఆకాంక్షించారు. 8లో



సేవలను సద్వినియోగం చేసుకోండి 8లో

సేవలను సద్విని యోగం చేసుకోవాలని సీఆర్ పీఎఫ్ కమాండెంటు ధర్మ ప్రకాష్ కోరారు.



కల్యాణం.. కమనీయం

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహ స్వామి వారి నిత్యకల్యాణాన్ని బుధవారం శాస్త్రోక్తంగా నిర్వహించారు.

న్యూస్‌రీల్

వైఎస్సార్‌సీపీ అరకు అసెంబ్లీ సమన్వయకర్తగా మత్స్యలింగం



సీఎం జగన్‌మోహన్‌రెడ్డితో మత్స్యలింగం

సాక్షి,పాడేరు: అరకులోయ అసెంబ్లీ నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ సమన్వమయకర్తగా రేగం మత్స్యలింగంను నియమిస్తూ పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు. హుకుంపేట జెడ్పీటీసీ పనిచేస్తున్న ఆయన అరకు నియోజకవర్గంలోని బలమైన కొండదొర సామాజిక వర్గానికి చెందిన వారు. గిరిజన సంక్షేమశాఖలో ఉపాధ్యాయుడిగా, గిరిజన సంక్షేమ ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర అధ్యక్షుడిగా పనిచేశారు. ఆయన 2018లో పార్టీ అధ్యక్షుడు జగన్‌మోహన్ రెడ్డి సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరారు. గిరిజనుల సేవే లక్ష్యంగా పనిచేస్తానని ఈ సందర్భంగా మత్స్యలింగం పేర్కొన్నారు.

మోదకొండమ్మను దర్శించుకున్న ప్రెస్ అకాడమి కార్యదర్శి

- కలెక్టర్‌ను సత్కరించిన బాలగంగాధర్ తిలక్



కలెక్టర్‌ను సత్కరిస్తున్న బాలగంగాధర్‌తిలక్

సాక్షి,పాడేరు: ఏపీ ప్రెస్ అకాడమి కార్యదర్శి బాలగంగాధర్‌తిలక్ బుధవారం జిల్లా కేంద్రం పాడేరులో పర్యటించారు. మోదకొండమ్మతల్లి దర్శించుకున్న ఆయన ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ పూజారి, ఇతర కమిటీ ప్రతినిధులు ఆయనను సత్కరించారు. అమ్మవారి చిత్రపటం, ప్రసాదం అందజేశారు. అనంతరం ఆయన కలెక్టర్ సుమిత్‌కుమార్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. శాలువాతో ఘనంగా సత్కరించారు.

తహసీల్దార్లకు బదిలీ

సాక్షి,పాడేరు: పాడేరు డివిజన్‌లోని పలు మండలాల తహసీల్దార్లకు బదిలీలు జరిగాయి. స్థానిక కలెక్టరేట్‌లోని భూ విభాగం తహసీల్దార్ బి.చిన్నికృష్ణను పార్వతీపురం మన్యం జిల్లాకు, అనంతగిరి తహసీల్దార్ రాంబాయిని విజయనగరం జిల్లా, అరకులోయ తహసీల్దార్ ఏ.వేణుగోపాల్‌ను పార్వతీపురం మన్యం జిల్లాకు బదిలీ అయింది. డుంబ్రిగుడ తహసీల్దార్ వి.త్రినాథరావునాయుడును విజయనగరం జిల్లా, హుకుంపేట తహసీల్దార్ రాజ్యలక్ష్మిని పార్వతీపురం మన్యం జిల్లా, పాడేరు డివిజనల్ అడ్మినిస్ట్రేషన్ అధికారి చిరంజీవిపడాల్‌ను పార్వతీపురం మన్యం జిల్లాకు బదిలీ చేస్తూ ఉత్తర్వులు వెలువడ్డాయి. పాడేరు తహసీల్దార్ నాగమణిని శ్రీకాకుళం జిల్లా, ముంచంగిపుట్టు తహసీల్దార్ నాగరాజును శ్రీకాకుళం జిల్లా, చింతపల్లి తహసీల్దార్ లచ్చాపాత్రుడును శ్రీకాకుళం జిల్లా, కొయ్యూరు తహసీల్దార్ తిరుమలరావును విజయనగరం జిల్లాకు ప్రభుత్వం బదిలీ చేసింది.

రాజవొమ్మంగి: తహసీల్దార్ వై.వి.సుబ్రహ్మణ్యాచారిని తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరానికి బదిలీ అయింది. ఈ మేరకు ప్రభుత్వం నుంచి ఉత్తర్వులు వెలువడినట్టు అధికారవర్గాలు తెలిపాయి.

మతిస్థిమితం లేని మహిళ ఆత్మహత్య



లక్ష్మి మృతదేహం

హుకుంపేట: మతిస్థిమితం లేని మహిళ ఇంట్లో ఉరివేసుకుని మృతి చెందింది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. మండలంలోని శోభకోట పంచాయతీ కాంగండువా గ్రామానికి చెందిన గెమ్మెలి లక్ష్మి బుధవారం ఇంట్లో దూలానికి ఉరి వేసుకుని ఉంది. ఈ సమయంలో ఇంట్లో ఎవ్వరూ లేరు. పీవీటీజీల ఇళ్ల నిర్మాణానికి కొలతలు తీసుకునేందుకు వెళ్లిన భర్త వెంకట్ తిరిగి ఇంటికి వచ్చేసరికి మృతి చెంది ఉంది. ఈ విషయం తెలుసుకున్న చుట్టుపక్కల వారు వెంటనే అక్కడికి చేరుకున్నారు. లక్ష్మి ఆత్మహత్య చేసుకున్న విషయాన్ని సర్పంచ్ శోభన్ తెలియజేయడంతో పోలీసులు కేసు నమోదు చేశారు. మతిస్థిమితం లేకపోవడం వల్లే ఆత్మహత్యకు పాల్పడినట్టు వారు తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పాడేరు జిల్లా ఆస్పత్రికి తరలించారు.

సరిహద్దుల్లో చెక్!

దండకారణ్యంలో మావోయిస్టులకు చెక్ పెట్టేందుకు ఆంధ్రా పోలీసులు సరికొత్తగా ముందుకు సాగుతున్నారు. ఛత్తీస్‌గఢ్ నుంచి మావోయిస్టుల చొరబాట్లను నిరోధించడంలో భాగంగా చింతూరు మండలం అల్లిగూడెంలో కొత్తగా ఆర్మ్‌డ్ ఔట్‌పోస్టును ఏర్పాటు చేశారు. ప్రస్తుతం ఛత్తీస్‌గఢ్‌లోని అటవీ ప్రాంతాలకు పరిమితమైన మావోయిస్టులు మన రాష్ట్రంలో ఎలాంటి ఘటనలకు పాల్పడకుండా ముందస్తు వ్యూహంలో భాగంగానే దీనిని ఏర్పాటుచేసినట్టు పోలీసు వర్గాలు తెలిపాయి.

- మావోయిస్టులు రాష్ట్రంలోకి చొరబడకుండా పోలీసుల వ్యూహం
- అల్లిగూడెంలో ఆర్మ్‌డ్ అవుట్‌పోస్టు ఏర్పాటు
- దండకారణ్యంలో అడ్డుకట్ట వేసేలా చర్యలు



చింతూరు మండలం అల్లిగూడెంలో కొత్తగా ఏర్పాటుచేసిన పోలీసు ఆర్మ్‌డ్ ఔట్‌పోస్టు



కూంబింగ్‌లో నిమగ్నమైన పోలీసు బలగాలు

చింతూరు: ఒకప్పుడు ఆంధ్రా, ఛత్తీస్‌గఢ్ సరిహద్దుల్లోని దండకారణ్య ప్రాంతం మావోయిస్టులకు గట్టి పట్టున్న ప్రాంతం. సరిహద్దుల గుండా ఇరు రాష్ట్రాల్లో ప్రవేశించి ఏవైనా విధ్వంసాలకు పాల్పడిన సందర్భాల్లో తప్పించుకునేందుకు దండకారణ్యంలోకి వెళ్లిపోతుంటారు.

ఇరు రాష్ట్రాల పోలీసుల సమన్వయంతో..

చింతూరు మండలం చిడుమూరు నుంచి మల్లంపేట వరకు ఛత్తీస్‌గఢ్‌కు ఆనుకుని దండకారణ్య సరిహద్దు ఉంది. అప్పుడప్పుడు మావోయిస్టులు విధ్వంసాలకు పాల్పడేందుకు ఈ పరిస్థితులు అనుకూలంగా ఉంటున్నాయి. ఇటీవల పార్టీ ఆవిర్భావ వారోత్సవాల సందర్భంగా చింతూరు మండలం చిడుమూరు వద్ద జాతీయ రహదారిపై ప్రయాణికుల కారును మావోయిస్టులు తగులబెట్టారు. దీంతోపాటు సరిహద్దుల వెంబడి పోలీసులకు నష్టం చేకూర్చేందుకు బూబీట్రాప్‌లను కూడా అమర్చారు. వెంటనే అప్రమత్తమైన పోలీసులు వాటిని చాకచక్యంగా వెలికితీసి నిర్వీర్యం చేశారు. ఇలాంటి పరిస్థితులు తలెత్తకుండా ఉండేందుకు ఛత్తీస్‌గఢ్ పోలీసుల సమన్వయంతో ఆంధ్రా పోలీసులు సరిహద్దుల వెంబడి అదనపు బలగాలతో కూంబింగ్‌ను మరింత ముమ్మరం చేశారు.

మల్లంపేట ఔట్‌పోస్టుపై దాడితో..

ఛత్తీస్‌గఢ్ నుంచి ఆంధ్రా సరిహద్దుల్లోకి మావోయిస్టుల చొరబాట్లను నిరోధించడంలో భాగంగా గతంలో చింతూరు మండలం మల్లంపేటలో తొలిసారిగా ఉమ్మడి రాష్ట్రంలోనే తొలి ఆర్మ్‌డ్ ఔట్‌పోస్టును ఏర్పాటు చేశారు. దీనివల్ల మావోయిస్టుల చొరబాట్లు కొంతమేర తగ్గుముఖం పట్టాయి. ఈ నేపథ్యంలో ఔట్‌పోస్టుపై మావోయిస్టులు తరచూ దాడులకు దిగుతుండడంతో కాలక్రమంలో దానిని ఎత్తివేసి ఏడుగురాళ్లపల్లికి తరలించారు. అనంతరం దానిని కూడా మావోయిస్టులు ధ్వంసం చేయడంతో చెక్‌పోస్టు లేకుండా పోయింది.

నిఘా వర్గాల హెచ్చరికలతో..

గత కొంతకాలంగా స్తబ్దుగా ఉన్న మావోయిస్టులు తిరిగి తమ ఉనికిని చాటుకునే ప్రయత్నంలో ఛత్తీస్‌గఢ్ సరిహద్దుల వెంబడి ఉన్న గ్రామాల్లో యువతను ఆకర్షించి పార్టీలోకి రిక్రూట్ చేసుకుంటున్నట్లు నిఘా వర్గాలు సమాచారం సేకరించాయి. ఈ క్రమంలో మావోయిస్టులు ఛత్తీస్‌గఢ్ నుంచి సరిహద్దులు దాటి ఆంధ్రాలో కూడా విధ్వంసాలకు పాల్పడే అవకాశముందని పోలీసులకు నిఘావర్గాలు హెచ్చరించినట్లు సమాచారం. దీనిపై అప్రమత్తమైన ఆంధ్రా పోలీసులు ఆంధ్రా, ఛత్తీస్‌గఢ్ సరిహద్దులను ఆనుకుని ఉన్న అల్లిగూడెంలో ఆర్మ్‌డ్ ఔట్‌పోస్టును ఏర్పాటు చేశారు. రాష్ట్రంలో రెండోదైన ఈ ఔట్‌పోస్టులో అదనపు బలగాలను ఉంచి సరిహద్దు ప్రాంతంలో నిరంతరం కూంబింగ్ నిర్వహిస్తున్నారు. దీనివల్ల మావోయిస్టులు ఆంధ్రాలోకి వచ్చి విధ్వంస ఘటనలకు పాల్పడకుండా ముందుగానే ఛత్తీస్‌గఢ్‌లోని అటవీ ప్రాంతాల్లోకి ఆంధ్రా పోలీసులు చొచ్చుకెళ్లి మావోయిస్టులను నిరోధించే అవకాశం ఉంటుంది. ఈ వ్యూహంలో భాగంగానే ఈ ఔట్‌పోస్టు ఏర్పాటు చేసినట్లు తెలిసింది.

అత్యాధునిక టెక్నాలజీతో..

అల్లిగూడెంలోని ఎత్తయిన కొండపై ఈ ఔట్‌పోస్టును అత్యాధునిక టెక్నాలజీతో ఏర్పాటుచేశారు. సరిహద్దుల్లో మావోయిస్టుల కార్యకలాపాలను సునాయాసంగా గుర్తించే అవకాశం ఉంటుంది. వారి కార్యకలాపాలపై ఎప్పటికప్పుడు ఆరాతీస్తూ ఉన్నతాధికారుల సూచనలతో ప్రత్యేక కూంబింగ్ ఆపరేషన్ నిర్వహించేందుకు పోలీసులు వ్యూహాత్మకంగా వ్యవహరిస్తున్నారు.

జేసీగా భావన వశిస్ట్ బాధ్యతల స్వీకరణ



భావన వశిస్ట్

సాక్షి, పాడేరు: జాయింట్ కలెక్టర్‌గా భావన వశిస్ట్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. 2019 ఐఏఎస్ బ్యాచ్‌కు చెందిన ఈమె అసిస్టెంట్ కలెక్టర్‌గా శిక్షణ పొంది పార్వతీపురం సబ్‌కలెక్టర్‌గా, గ్రామ గ్రామ, వార్డు సచివాలయాల అదనపు సంచాలకులుగా పనిచేశారు. ఇటీవల జరిగిన బదిలీల్లో ఆమెను జేసీగా ప్రభుత్వం నియమించడంతో విధుల్లో చేరారు.

స్వయం ఉపాధికి ఉచిత శిక్షణ

- రంపచోడవరం ఐటీడీఏ పీవో సూరజ్ గనోరే



రంపచోడవరం: గిరిజన యువతీ యువకులకు ఆర్థిక తోడ్పాటు అందించే చర్యల్లో భాగంగా యూత్ ట్రైనింగ్ సెంటర్ల ద్వారా శిక్షణ ఇస్తున్నట్టు స్థానిక ఐటీడీఏ పీవో సూరజ్ గనోరే బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. డ్రైవింగ్, బ్యూటీషియన్ కోర్సు, హ్యాండ్ ఎంబ్రైడరీ, పుట్టగొడుగుల పెంపకం, వెదురుతో వస్తువుల తయారీ కోర్సుల్లో ఆసక్తి గల యువతకు 30 నుంచి 60 రోజులపాటు శిక్షణ ఇస్తున్నట్టు చెప్పారు. ఉచిత భోజన వసతి కల్పిస్తామని ఆయన పేర్కొన్నారు. అభ్యర్థులు వెలుగు ఏపీడీకి ఫిబ్రవరి 4వ తేదీలోగా దరఖాస్తులు అందజేయాలని సూచించారు.

టీడీపీని చిత్తుగా ఓడించేందుకు సిద్ధం కావాలి

అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ



మాట్లాడుతున్న అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ

ముంచంగిపుట్టు: రానున్న ఎన్నికల్లో మారోమారు టీడీపీని చిత్తుగా ఓడించేందుకు పార్టీ శ్రేణులు సిద్ధం కావాలని అరకు ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు చెట్టి పాల్గుణ పిలుపునిచ్చారు. మండల కేంద్రంలో బుధవారం పార్టీకి చెందిన సర్పంచులు, ఎంపీటీసీలు, నేతలతో నిర్వహించిన సమావేశంలో ఆయన మండలంలోని రాజకీయ పరిస్థితులు, పరిణామాలను తెలుసుకున్నారు. అనంతరం మాట్లాడారు. జగనన్న పాలనలో జరిగిన అభివృద్ధి మళ్లీ వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చేలా చేస్తుందని అన్నారు. క్షేత్రస్థాయిలో కార్యకర్తలు ఇప్పటి నుంచే పార్టీ మరింత బలోపేతానికి శాయశక్తులా కృషి చేయాలని కోరారు. ఎన్నికలలో సత్తా చాటి టీడీపీని భూస్థాపితం చేయాలని కోరారు.అందరం కలిసికట్టుగా పని చేసి జగనన్నను మారోమారు ముఖ్యమంత్రి పీఠాన్ని అధిరోహిండంలో పాలుపంచుకోవాలని పార్టీ నేతలకు దిశ నిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ సీతమ్మ, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు మల్లికార్జున్, వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి జగబంధు, మండల జేఏసీ కన్వీనర్ కొండలరావు, సర్పంచ్‌లు ఫోరం మండల అధ్యక్షులు రమేష్, సర్పంచులు, ఎంపీటీసీలు, నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రజాపంపిణీ వ్యవస్థలో అవకతవకలపై ఫిర్యాదు చేయండి

- సబ్ కలెక్టర్ ధాత్రిరెడ్డి



సాక్షి,పాడేరు: ప్రజాపంపిణీ వ్యవస్థలో అవకతవకలపై 9440933450 నంబరుకు వాట్సాప్/ఫోన్‌లో ఫిర్యాదు చేయాలని పాడేరు సబ్ కలెక్టర్ ధాత్రిరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. పాడేరు డివిజన్ పరిధిలో ఫిర్యాదులకు సంబంధించి తమ కార్యాలయంలో కంట్రోల్‌రూమ్ ఏర్పాటు చేశామన్నారు. బియ్యం, ఇతర నిత్యావసరాల పంపిణీలో ఎలాంటి అక్రమాలు జరిగినా, సక్రమంగా పంపిణీ చేయకపోయినా, నిత్యావసరాలు పక్కదారి పట్టినా ఆ నంబరుకు తెలియజేయాలని ఆమె పేర్కొన్నారు.

జల విద్యుత్ ఉత్పత్తికి పొంచి ఉన్న నీటి గండం!

అడుగంటిన జోలాపుట్టు స్పిల్‌వే



స్పిల్‌వే వద్ద అడుగంటిన నీటి నిల్వలు

ముంచంగిపుట్టు: ఆంధ్ర–ఒడిశా రాష్ట్రాలు సంయుక్తంగా నిర్వహిస్తున్న మాచ్‌ఖండ్ జల విద్యుత్ కేంద్రానికి నీరు అందించే జోలాపుట్టు స్పిల్‌వే జలాశయం వెలవెలబోతోంది. గత ఏడాది నీరు నిండుగా ఉండేది. ఈ ఏడాది నీటి నిల్వలు అడుగంటిపోవడం జలవిద్యుత్ కేంద్రాలకు ఇబ్బందికర పరిస్థితి. ప్రాజెక్టులకు విద్యుత్ ఉత్పత్తి చేయగలిగే సామర్థ్యం ఉన్నా తగినంతా నీరు లేకపోవడం వల్ల ఎప్పుడు ఉత్పత్తి నిలిచిపోతుందో తెలియని పరిస్థితి నెలకొంది. జోలాపుట్టు ప్రాజెక్ట్ ప్రధాన, స్పిల్‌వే జలాశయాల్లో పూర్తి స్థాయి నీటి మట్టం 2750 అడుగులకు ప్రస్తుతం ప్రధాన జలాశయంలో బుధవారం నాటికి 2715.25 అడుగుల మేర నీరు ఉంది. గత ఏడాది స్పిల్‌వే జలాశయంలో 2735 అడుగుల నీరు ఉండేది. ఈ ఏడాది ఆ మేరకు కూడా నీరు లేదు. ఈ రెండు జలాశయాల నీటి మట్టంపై ఆధారపడి ఉన్న డుడుమ జలాశయంలో సైతం నీటి మట్టం 10 అడుగులు తక్కువ ఉంది. సాధారణ నీటి మట్టం 2590 అడుగులు కాగా ప్రస్తుతం 2580.10 అడుగులు ఉంది. రానున్నది ఎండాకాలం కావడంతో రెండు జలాశయాల్లో ఉన్న నీరు సైతం పూర్తిగా అడుగంటి పోయే ప్రమాదం ఉంది. దీంతో మాచ్‌ఖండ్ జల విద్యుత్ కేంద్రంలో ఉత్పాదనకు ఆటకం కలిగే పరిస్థితి లేకపోలేదు.

ఎన్నికల విధులు బాధ్యతగా నిర్వర్తించాలి

రంపచోడవరం సబ్ కలెక్టర్ ప్రశాంత్‌కుమార్



రాజవొమ్మంగిలో బీఎల్వోలకు సూచనలిస్తున్న సబ్‌కలెక్టర్ ప్రశాంత్ కుమార్

రాజవొమ్మంగి: రానున్న సార్వత్రిక ఎన్నికల్లో సిబ్బంది విధులు బాధ్యతగా నిర్వర్తించాలని రంపచోడవరం సబ్ కలెక్టర్ ప్రశాంత్‌కుమార్ ఆదేశించారు. బుధవారం ఆయన స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో బూత్ లెవెల్ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పలు సూచనలు చేశారు. ప్రతీ పోలింగ్ కేంద్రంలో మౌలిక వసతుల కల్పించాలని ఆదేశించారు. అనంతరం ఆయన మండలంలోని పలు పోలింగ్ కేంద్రాలను సందర్శించి పరిస్థితిని పరిశీలించారు. తంటికొండ పోలింగ్ కేంద్రంలో నిర్మాణ దశలో ఉన్న మరుగుదొడ్లను త్వరితగతిన పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని తహసీల్దార్ వైవీ సుబ్రహ్మణ్యాచారిని ఆదేశించారు. అనంతరం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ ప్రతి ఒక్కరు ఓటుహక్కును నిర్భయంగా వినియోగించుకునేలా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. పోలింగ్ కేంద్రం సెల్‌నెట్ వర్క్ పరిధిలో ఉందా లేదా అనేది కూడా పరిశీలించి తగు చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. నియోజకవర్గ పరిధిలో దాదాపు సమస్యాత్మక కేంద్రాలు ఏవీ లేవన్నారు. చింతూరు సరిహద్దులోని పోలింగ్‌కేంద్రాల్లో అవసరం మేరకు ముందు జాగ్రత్త చర్యలు చేపడతామన్నారు. మార్గం మధ్యలో జడ్డంగి పీహెచ్‌సీని ఆయన సందర్శించారు. రోగులు వేచి ఉండేందుకు వీలుగా సౌకర్యం కల్పించాలని సిబ్బందికి సూచించారు. డీటీ సత్యనారాయణ, ఎంపీడీవో విజయరంగారావు, సెక్టోరల్ అధికారులు పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల్లో సౌకర్యాలపై ప్రత్యేకదృష్టి



అధికారులకు సూచనలిస్తున్న పీవో అభిషేక్

అరకులోయ టౌన్: పోలింగ్ కేంద్రాల్లో పూర్తిస్థాయిలో సౌకర్యాలు కల్పించేలా దృష్టి సారించాలని పాడేరు ఐటీడీఏ పీవో అభిషేక్ ఆదేశించారు. బుధవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన వివిధ శాఖల అధికారులకు సూచనలిచ్చారు. ఎటువంటి ఇబ్బందులు లేకుండా ముందస్తుగా ఏర్పాట్లు చేయాలని తహసీల్దార్ వేణుగోపాల్‌కు సూచించారు. తహసీల్దార్ కార్యాలయం, గ్రామ సచివాలయం, రైతు భరోసా కేంద్రాల చుట్టూ ప్రహరీ నిర్మాణ పనులను నెల రోజుల్లో పూర్తి చేయాలని ట్రైబల్ వెల్ఫేర్ ఏఈ అభిషేక్‌ను ఆదేశించారు. ఒకొక్క ప్రహరీ నిర్మాణానికి రూ.10 లక్షల చొప్పున నిధులు కేటాయిస్తున్నామన్నారు. అరకు నియోజకవర్గం పరిధిలో 304 పోలింగ్ కేంద్రాలు, 1500మంది సిబ్బంది విధులు నిర్వహిస్తారన్నారు. అరకు, పాడేరు, రంపచోడవరం నియోజకవర్గాలకు సంబంధించి ఓట్లను జిల్లా కేంద్రం పాడేరులో లెక్కిస్తామని ఆయన వెల్లడించారు.

ముగిసిన జాతీయ సదస్సు



ప్రశంసా పత్రాలు అందజేస్తున్న ఏడీఆర్ సురేష్‌కుమార్

చింతపల్లి రూరల్: స్థానిక ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానంలో గత రెండు రోజులుగా నిర్వహిస్తున్న జాతీయ సదస్సు బుధవారంతో ముగిసింది. ఈ సందర్భంగా పరిశోధన స్థానం ఏడీఆర్ డాక్టర్ సురేష్‌కుమార్ మాట్లాడుతూ ఈ సదస్సు ద్వారా గిరి రైతులకు కొత్త పంటలు పరిచయం చేసేందుకు అవకాశం ఏర్పడిందన్నారు. వివిధ రాష్ట్రాలకు చెందిన శాస్త్రవేత్తలు,పీహెచ్‌డీ విద్యార్థుల పోస్టర్ విభాగంలో ఉత్తమంగా ప్రదర్శించిన వారికి ఏడీఆర్ ప్రశంసాపత్రాలు అందజేశారు.

గిరిజన గ్రామాల్లో ప్రతీ ఇంటికి విద్యుత్ సౌకర్యం

ఏపీఈపీడీసీఎల్ ఎస్‌ఈ మహేంద్రనాథ్



పీవీటీజీ గ్రామాన్ని సందర్శించిన ఏపీఈపీడీసీఎల్ ఎస్‌ఈ మహేంద్రనాథ్

సాక్షి,పాడేరు: ఏజెన్సీలోని పీవీటీజీతో పాటు అన్ని గ్రామాల్లోని గిరిజనుల ప్రతీ ఇంటికి విద్యుత్ సౌకర్యం కల్పిస్తున్నామని ఏపీఈపీడీసీఎల్ ఎస్‌ఈ మహేంద్రనాథ్ తెలిపారు. ఏజెన్సీలోని పలు గ్రామాలను బుధవారం సందర్శించిన ఆయన విద్యుదీకరణ పనులను పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతేడాది అనంతగిరిలో జరిగిన ఫోరం ఆఫ్ రెగ్యులేటరీస్ కార్యక్రమంలో కలెక్టర్ సుమిత్‌కుమార్ చొరవ తీసుకున్నారన్నారు. కలెక్టర్,ఐటీడీఏ పీవో వి.అభిషేక్ ఏపీఈఆర్‌సీ చైర్మన్ జస్టిస్ సి.వి.నాగార్జునరెడ్డిని కలిసి విద్యుత్ సౌకర్యం లేని గ్రామాలకు విద్యుదీకరణ చేయాలని విన్నవించారని ఆయన తెలిపారు. ఈ మేరకు పాడేరు ఐటీడీఏ పరిధిలో విద్యుత్ సౌకర్యం లేని 271 మారుమూల గ్రామాలను గుర్తించామన్నారు. సుమారు 4944 గిరిజన కుటుంబాలకు ఇంటింటా విద్యుత్ సౌకర్యం కల్పించేందుకు రూ.29.96కోట్లతో ప్రతిపాదనలు సిద్ధం చేసినట్టు తెలిపారు. అలాగే ప్రస్తుత సీఎండీ పృథ్వీతేజ్ మార్గదర్శకంలో పీఎం జన్‌మన్ పథకంలో జిల్లాలో 1474 పీవీటీజీ గ్రామాల్లో 8819 కుటుంబాలకు ఇంటింటా విద్యుత్ సౌకర్యానికి రూ.33.49కోట్లతో డీపీఆర్ మంజూరు అయిందన్నారు. అలాగే ఇంకా విద్యుదీకరణకు నోచుకోని జిల్లాలోని 245 నాన్ పీవీటీజీ గ్రామాల్లో 1544 కుటుంబాలకు విద్యుత్ సౌకర్యం కల్పించేందుకు ఆర్‌డీఎస్ఎస్ పథకంలో ప్రతిపాదనలు సిద్ధం చేశామన్నారు. పీవీటీజీ, ఆర్‌డీఎస్ఎస్ పథకాలలో ఎలాంటి రుసుం లేకుండానే విద్యుత్ సౌకర్యం కల్పిస్తామని, అర్హులైన గిరిజన కుటుంబాలకు ప్రభుత్వం నెలకు కల్పించిన 200 యూనిట్ల ఉచిత విద్యుత్ రాయితీని అమలు చేస్తున్నామని ఆయన పేర్కొన్నారు.

ఉచిత వైద్యశిబిరానికి విశేష స్పందన



శిబిరంలో పాల్గొన్న పోలీసు ఉన్నతాధికారులు



క్రీడా కిట్లు అందజేస్తున్న పోలీసు అధికారులు

సీఆర్‌పీఎఫ్, స్థానిక పోలీసుల ఆధ్వర్యంలో నిర్వహణ

చింతపల్లి రూరల్: మండలంలో బలపం పంచాయతీ గుంజీవీడు గ్రామంలో సివిల్ యాక్షన్ కార్యక్రమంలో భాగంగా బుధవారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. ఈ శిబిరానికి స్థానిక ఏఎస్పీ ప్రతాప్ శివకిశోర్, సీఆర్‌పీఎఫ్ 234 బెటాలియన్ కమాండెంట్ సంజయ్ ద్వివేది, డీఐజీలు సత్యేంద్రనాథ్, మిశ్రా, శివశంకర్ ఆధ్వర్యంలో వహించారు. ఈ సందర్భంగా సీఆర్‌పీఎఫ్ అధికారులు మాట్లాడుతూ గంజువీడు గ్రామాన్ని దత్తత తీసుకున్నట్లు తెలిపారు. రానున్న రోజుల్లో మరిన్ని సేవా కార్యక్రమాలు నిర్వహిస్తామని వారు పేర్కొన్నారు. అన్నవరంలో కూడా గిరి యువతకు వాలీబాల్ పోటీలు నిర్వహించి బహుమతులు, క్రీడా కిట్లు, టీషర్టులు అందజేశారు. అనంతరం చింతపల్లి ఏఎస్పీ రాళ్లగడ్డలోని ఏవోబీ అవుట్‌పోస్టును సందర్శించారు. సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ కమాండెంట్ కులదీప్, సీఐ రమేష్, ఎస్ఐ రమణ, వైద్యులు అరుణ్‌కాంత్ తదితరులు పాల్గొన్నారు.

వేర్వేరు ఘటనల్లో మూడు వ్యాన్ల బోల్తా



చుట్టుమెట్ట వద్ద బోల్తా పడిన కోడి గుడ్ల వ్యాన్



గలగండ సమీపంలో బోల్తా పడిన మినీ వ్యాన్



రంపచోడవరం ఏరియా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న క్షతగాత్రులు

పెదబయలు: మండలంలోని అరడకోట పంచాయతీ చుట్టుమెట్ట గ్రామ సమీపంలోని మలుపు వద్ద అంగన్‌వాడీ కేంద్రాలకు గుడ్లు సరఫరా చేసేందుకు వస్తున్న వ్యాన్ బుధవారం సాయంత్రం బోల్తా పడింది. చుట్టుమెట్ట మలుపు వద్ద ఒక్కసారిగా ఎదురుగా వస్తున్న ద్విచక్ర వాహనాన్ని తప్పించబోయి అదుపుతప్పడంతో బోల్తా పడింది. వ్యాన్‌లో ఉన్న సుమారు 40 వేల కోడిగుడ్లకు నష్టం జరిగింని డ్రైవర్ రమణ తెలిపారు. రోడ్డుకు అడ్డంగా పడిన వ్యాన్‌ను జేసీబీ సాయంతో పక్కకు తొలగించారు. ఈ ఘటనలో డ్రైవర్, క్లీనర్లకు స్వల్ప గాయాలయ్యాయి.

గలగండ సమీపంలో..

మండలంలోని గలగండ గ్రామ సమీపంలో మినీ వ్యాన్ బోల్తా పడింది. బుధవారం సాయంత్రం పెదబయలు నుంచి పాడేరు వెళ్తుండగా అదుపు తప్పి ప్రమాదానికి గురైంది. డ్రైవర్ సుబ్బారావు, క్లీనర్ వంశీకి స్వల్పగాయాలయ్యాయి. స్థానిక పోలీసులు కేసు నమోదు చేశారు.

వై.రామవరం మండలంలో..

మారేడుమిల్లి : వై.రామవరం మండలంలో ధారగడ్డ గ్రామ ఘాట్ వద్ద బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో వ్యాన్ బోల్తాపడిన ఘటనలో పలువురు గాయపడ్డారు. చింతూరు మండల వాలిగూడెం గ్రామానికి చెందిన పలువురు వెదురు బుట్టలు, చాపల లోడుతో వై.రామవరం మండలం పోతవరంలో జరిగే వారపు సంతకు వ్యాన్‌లో బయలుదేరారు. ధారగెడ్డ–గుర్తేడు గ్రామ సమీపంలోని ఘాట్ రోడ్డు వద్దకు వచ్చేసరికి వ్యాన్ అదుపు తప్పి బోల్తాపడింది. ఈ ఘటనలో కొర్ర నరసింహరావు,రజింత్ కుమార్, మామిడి పూర్ణ, దుంగ శ్రీను, గేదుల వరలక్ష్మి, వెంకటలక్ష్మి, నాగరమణ గాయపడ్డారు. వీరిని తొలుత గుర్తేడు పీహెచ్‌సీకి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం 108లో రంపచోడవరం ఏరియా ఆస్పత్రికి తరలించారు.

క్లుప్తంగా

జీసీసీ కార్యాలయ సహాయకులకు పదోన్నతి



పదోన్నతి పొందిన సిబ్బందితో జీసీసీ చైర్‌పర్సన్ స్వాతిరాణి, వీసీ అండ్ ఎండీ సురేష్‌కుమార్

విశాఖ సిటీ: గిరిజన సహకార సంస్థలో రాష్ట్రంలో మారుమూల గిరిజన ప్రాంతాల్లో 20 నుంచి 30 ఏళ్లకు పైగా పనిచేస్తున్న 21 మంది ఎంసీడబ్ల్యూ/కార్యాలయ సహాయకులకు సేల్స్‌మెన్‌గా పదోన్నతి లభించింది. జీసీసీ చైర్‌పర్సన్ శోభాస్వాతిరాణి, వీసీ అండ్ ఎండీ జి.సురేష్‌కుమార్ చేతుల మీదుగా సిబ్బందికి జీసీసీ ప్రధాన కార్యాలయంలో బుధవారం పదోన్నతి పత్రాలను అందజేశారు. ఈ పదోన్నతులు పొందిన 21 మందిలో 17 మంది షెడ్యూల్డ్ తెగలుకు చెందిన వారు ఉన్నారు. తమ అర్హతలు, సేవలు గుర్తించి పదోన్నతులు కల్పించినందుకు యాజమాన్యానికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా జీసీసీ చైర్‌పర్సన్ శోభాస్వాతి రాణి మాట్లాడుతూ సంస్థలో పెండింగ్‌లో ఉన్న మిగిలిన కేడర్ పదోన్నతుల ప్రక్రియ చేపడతామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సంస్థ జనరల్ మేనేజర్(పరిపాలన) జె.యాస్టన్, డివిజనల్ మేనేజర్ రంపచోడవరం జి.పార్వతీశ్వరరావు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుడు అప్పలరాజు మృతి



పద్మనాభం: ఉపాధ్యాయుడు సంబంగి అప్పలరాజు మృతిపట్ల పలువురు సంతాపం వ్యక్తం చేశారు. మండలంలోని పొట్నూరు గ్రామానికి చెందిన అప్పలరాజు మద్ది పంచాయతీ తునిపాలం ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పని చేశారు. 2023 జూన్‌లో జరిగిన బదిలీల్లో అల్లూరి సీతారామరాజు జిల్లా అనంతగిరి మండలం గాలిపాడు ప్రాథమిక పాఠశాలకు బదిలీ అయ్యారు. అనారోగ్యానికి గురైన అప్పలరాజు విశాఖపట్నంలోని ఓ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందారు. విషయం తెలుసుకున్న పలువురు ఉపాధ్యాయులు సంతాపం తెలిపారు.

అప్పన్న హుండీ ఆదాయం రూ.2.24 కోట్లు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి హుండీ ఆదాయం గత 35 రోజులకు గాను 2కోట్ల 24లక్షల 90వేల 276 రూపాయలు వచ్చినట్టు దేవస్థానం ఈవో ఎస్.శ్రీనివాసమూర్తి తెలిపారు. సింహగిరిపై యాత్రిక సదన్‌లో బుధవారం హుండీ ఆదాయాన్ని లెక్కించారు. నగదుతో పాటు 143 గ్రాముల బంగారం, 14 కిలోల వెండి లభించినట్టు ఈవో పేర్కొన్నారు. లెక్కింపులో దేవస్థానం ఉద్యోగులు, సిబ్బంది, స్వచ్ఛంద సంస్థల సభ్యులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయిలో సత్తా చాటాలి



మాట్లాడుతున్న కలెక్టర్ సుమిత్‌కుమార్



పోటీలను తిలకిస్తున్న కలెక్టర్ సుమిత్‌కుమార్, ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి, వైఎస్సార్‌సీపీ అసెంబ్లీ నియోజకవర్గ సమన్వయకర్త మత్స్యరాస విశ్వేశ్వరరాజు

- కలెక్టర్ సుమిత్‌కుమార్ ఆకాంక్ష
- ఆడుదాం ఆంధ్ర జిల్లా స్థాయి పోటీలు ప్రారంభం
- హాజరైన ఎమ్మెల్యే కొట్టగుల్లి భాగ్యలక్ష్మి, వైఎస్సార్‌సీపీ అసెంబ్లీ నియోజకవర్గ సమన్వయకర్త మత్స్యరాస విశ్వేశ్వరరాజు

పాడేరు : ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ఆడుదాం ఆంధ్రా పోటీల్లో రాష్ట్ర స్థాయిలో విజేతలుగా నిలవాలని కలెక్టర్ సుమిత్‌కుమార్ ఆకాంక్షించారు. పాడేరు ప్రభుత్వ జూనియర్ కళాశాల క్రీడా మైదానంలో బుధవారం ఆడుదాం ఆంధ్రా జిల్లా స్థాయి పోటీలను కలెక్టర్ సుమిత్‌కుమార్, పాడేరు ఎమ్మెల్యే కొట్టగుల్లి భాగ్యలక్ష్మి, వైఎస్సార్‌సీపీ పాడేరు అసెంబ్లీ నియోజకవర్గ సమన్వయకర్త మత్స్యరాస విశ్వేశ్వరరాజు ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ సుమిత్‌కుమార్ మాట్లాడుతూ నెల రోజుల నుంచి ఆడుదాం ఆంధ్రా క్రీడా పోటీలు గ్రామ స్థాయి, మండల స్థాయి, నియోజకవర్గ స్థాయిలో విజయవంతంగా నిర్వహించడం గొప్ప విషయమని, పోటీల విజయవంతానికి గ్రామ సచివాలయ సిబ్బంది, ఫిజికల్ డైరెక్టర్లు, ఎంపీడీవోలు, స్పోర్ట్స్ అథారిటీ అధికారులు ఎంతో కృషి చేశారన్నారు. జిల్లా స్థాయిలో ఆడుతున్న క్రీడాకారులు అత్యుత్తమ ప్రతిభ కనబర్చి రాష్ట్ర స్థాయిలో పతకాలు సాధించి అల్లూరి జిల్లాకు ప్రత్యేక గుర్తింపు తీసుకురావాలని ఆకాంక్షించారు. ఎమ్మెల్యే కొట్టగుల్లి భాగ్యలక్ష్మి మాట్లాడుతూ ఆడుదాం ఆంధ్రా పోటీల్లో ప్రతి ఒక్కరు భాగస్వామ్యం కావడం సంతోషమన్నారు. గ్రామీణ ప్రాంత క్రీడాకారుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికి తీసేందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకుందన్నారు. క్రీడకారులు క్రీడా నైపుణ్యాన్ని ప్రదర్శించాలని సూచించారు. వైఎస్సార్‌సీపీ పాడేరు అసెంబ్లీ నియోజకవర్గ సమన్వయకర్త మత్స్యరాస విశ్వేశ్వరరాజు మాట్లాడుతూ క్రీడలు శారీరక, మానసిక ఉల్లాసానికి ఎంతగానో దోహదం చేస్తాయని, ప్రతి ఒక్కరు క్రీడల పట్ల మక్కువ పెంచుకోవాలని సూచించారు. క్రీడాకారులను ప్రోత్సహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం అనేక చర్యలు తీసుకుంటోందని క్రీడాకారులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అనంతరం అతిథులంతా క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. జిల్లా నుంచి ఇతర ప్రాంతాలకు వెళ్లి క్రీడల్లో ప్రతిభ కనబర్చిన పలువురు క్రీడాకారులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఎంపీపీ సొనారి రత్నకుమారి, డీఎల్డీఓ శాంతలక్ష్మి, జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ అధికారి జగన్మోహనరావు, వ్యవసాయ సలహా మండలి చైర్మన్ సరస్వతి, మార్కెట్ కమిటీ చైర్మన్ కూతంగి సూరిబాబు, వైస్ ఎంపీపీ కనకాలమ్మ, మండల అధ్యక్షుడు సీదరి రాంబాబు, పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి సీదరి మంగ్లన్నదొర, సర్పంచ్‌లు వంతాల రాంబాబు, గొల్లోరి నీలకంఠం, ఎంపీటీసీ సభ్యులు సన్యాసిరావు, రామకృష్ణ, పాడేరు, రంపచోడవరం, అరకు నియోజకవర్గాల నుంచి అధిక సంఖ్యలో క్రీడాకారులు పాల్గొన్నారు.

సేవలను సద్వినియోగం చేసుకోండి

సీఆర్‌పీఎఫ్ డి42 బెటాలియన్ కమాండెంట్ ధర్మ ప్రకాష్





బెటాలియన్ పోలీసులు నిర్వహించిన సివిక్ యాక్షన్ ప్రోగ్రాంలో దేశభక్తి, గిరిజన సంప్రదాయ నృత్యాలు చేస్తున్న విద్యార్థులు, సీఆర్‌పీఎఫ్ జవాన్లు

వై.రామవరం: గిరిజన ప్రాంతంలో సీఆర్‌పీఎఫ్ పోలీసులు అందిస్తున్న సేవలను సద్విని యోగం చేసుకోవాలని డి42 బెటాలియన్ కమాండెంటు ధర్మ ప్రకాష్ కోరారు. స్థానిక పోలీసు స్టేషన్‌లో ఆబెటాలియన్ డిప్యూటీ కమాండెంటు బి.రత్నమ్మ అధ్యక్షతన బుధవారం నిర్వహించిన సివిక్ యాక్షన్ ప్రోగ్రాంను ఆయన ప్రారంభించారు. అనంతరం ధర్మ ప్రకాష్ మాట్లాడుతూ మండలంలోని 15 మంది పేద గిరిజన మహిళలకు ఉచిత భోజన వసతి కల్పించి నెలరోజులపాటు ఉచిత శిక్షణ ఇస్తున్నామన్నారు. అనంతరం వారికి కుట్టుమెషీన్లు అందజేస్తామన్నారు. గతంలో వికలాంగులకు ట్రై సైకిళ్లు, వితంతువులకు కుట్టుమెషీన్లు, కళాశాల విద్యార్థులకు సైకిళ్లు, పాఠశాలలకు కంప్యూటర్లు అందజేశామన్నారు. యువతకు డ్రైవింగ్ శిక్షణ ఇచ్చి, లైసెన్సులు మంజూరు చేయించామన్నారు. గ్రామాల్లో మంచినీటి పథకాలు, బస్‌షెల్టర్ల నిర్మాణం, ఉచిత మెగా వైద్యశిబిరాలు, రైతులకు రైతులకు వ్యవసాయ పరికరాలు అందజేశామన్నారు. ఈకార్యక్రమంలో స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థినులు, బెటాలియన్ జవాన్లు దేశభక్తి గేయాలు, గిరిజన సంప్రదాయ నృత్యాలతో అలరించారు. వారికి కమాండెంట్ చేతుల మీదుగా బహుమతులు అందజేశారు. అనంతరం కుట్టుశిక్షణను కమాండెంటు ధర్మ ప్రకాష్ ప్రారంభించారు. బెటాలియన్ సీనియర్ మెడికల్ ఆఫీసర్ జె.నితిన్, అసిస్టెంటు కమాండెంట్ ఎంఎల్ నాయుడు, ఇన్‌స్పెక్టర్ జె.పట్టాభి, వెంకటరమణ, సర్పంచ్ పల్లాల బాలురెడ్డి, పంచాయతీ కార్యదర్శి మధుసూదనరాజు, లలిత గిరిజన మహిళామండలి ఎన్జీవో సాంబశివరావు, సీఆర్‌పీఎఫ్ డి42 బెటాలియన్ సిబ్బంది పాల్గొన్నారు.

డీసీసీబీ ఉద్యోగుల సొసైటీ ఎన్నికల నోటిఫికేషన్ జారీ

విశాఖ విద్య: జిల్లా కేంద్ర సహకార బ్యాంకు ఉద్యోగుల కో–ఆపరేటివ్ సొసైటీ మేనేజ్‌మెంట్ కమిటీ ఎన్నికలకు రంగం సిద్ధమైంది. ఈ మేరకు కలెక్టర్ డాక్టర్ మల్లికార్జున ఆమోదం మేరకు ఎన్నికల అధికారి పి.రేఖా జ్యోతిర్మయి బుధవారం నోటిఫికేషన్ జారీ చేశారు. ఈ నెల 15న ఉదయం 9గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు విశాఖపట్నం మర్రిపాలెంలోని డీసీసీబీ ప్రధాన కార్యాలయం ప్రాంగణంలో ఎన్నికలు నిర్వహిస్తారు. 9 మంది సభ్యులను ఎన్నుకునే నిమిత్తం బ్యాలెట్ పద్ధతిన ఎన్నికలు జరుగుతాయి. ఇందుకోసం ఈ నెల 6న ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు నామినేషన్ పత్రాలను స్వీకరిస్తారు. 7న నామినేషన్లు పరిశీలన ఉంటుంది. 8న నామినేషన్లు ఉపసంహరణ, అదే రోజు సాయంత్రం పోటీలో ఉన్న వారి పేర్లు ప్రకటించి, వారికి ఎన్నికల గుర్తు కేటాయిస్తారు. 15న ఎన్నికలు నిర్వహించి, అదే రోజు సాయంత్రం లెక్కింపు ప్రక్రియ చేపట్టనున్నట్లు ఆమె వెల్లడించారు. దీంతో ఉమ్మడి జిల్లావ్యాప్తంగా ఉన్న డీసీసీబీ బ్యాంకు ఉద్యోగుల్లో ఎన్నికల సందడి మొదలైంది.

యువతకు ఉపాధి అవకాశాలు



రాజవొమ్మంగి సీఐ స్వామినాయుడు



రేఖపల్లి జంక్షన్‌లో యువతకు అవగాహన కల్పిస్తున్న ఎస్‌ఐ వెంకటేష్



సింధువాడలో యువతకు వాలీబాల్ కిట్లు అందజేస్తున్న ఎస్‌ఐ శివకుమార్

వీఆర్ పురం: పోలీస్ శాఖ ఆధ్వర్యంలో ప్రేరణ కార్యక్రమం ద్వారా కల్పిస్తున్న ప్రయివేట్ ఉద్యోగావకాశాలను యువతులు సద్వినియోగం చేసుకోవాలని ఎస్‌ఐ బి.వెంకటేష్ అన్నారు. రేఖపల్లిలో జంక్షన్‌లో బుధవారం ప్రేరణ కార్యక్రమంపై గ్రామస్తులకు అవగాహన కల్పించారు. 18 నుంచి 30 సంవత్సరాల వయసు ఉండి ఇంటర్ ఉత్తీర్ణత కలిగిన యువతులు ఈ ఉద్యోగాలకు అర్హులని ఆయన చెప్పారు. ఈ మేరకు ఎటపాకలో ఈ నెల 12 న పరీక్ష నిర్వహించనున్నట్టు చెప్పారు.పరీక్షలో ఉత్తీర్ణులైన వారికి కర్ణాటక రాష్ట్రం హోసూర్‌లో టాటా టెక్నాలజీ ద్వారా ట్రెనింగ్ ఇచ్చి వారి ఆధ్వర్యంలో ఉద్యోగం కల్పించనున్నట్టు తెలిపారు. ఉద్యోగం పొందిన వారికి వసతి, భోజన సౌకర్యం కల్పించి నెలకు రూ.17,853 జీతంగా అందజేస్తారని తెలిపారు. గతంలో జిల్లా నుంచి సుమారు 80 మందికి పైగా ఉపాధి అవకాశాలు పొందారన్నారు.. హెచ్‌సీ నిర్మల్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

రాజవొమ్మంగి: పోలీసు శాఖ ఆధ్వర్యంలో ప్రైవేట్ రంగంలో యువతకు ఉపాధి కల్పిస్తున్నట్టు సీఐ స్వామి నాయుడు చెప్పారు. ఆయన బుధవారం విలేకరులతో మాట్లాడుతూ ఉద్యోగ అవకాశాలకు సంబంధించి జడ్డంగి పోలీసుస్టేషన్‌లో దరఖాస్తులు పొందవచ్చని, మరిన్ని వివరాలకు సిబ్బందిని సంప్రదించవచ్చన్నారు.

మోతుగుడెం: డొంకరాయి పోలీసుస్టేషన్ పరిధిలోని సింధువాడలో ఎస్‌ఐ శివకుమార్ బుధవారం పర్యటించారు. ఆయన మాట్లాడుతూ యువతకు పోలీసు శాఖ అండగా నిలుస్తోందని, ఉపాధి అవకాశాలు కల్పిస్తోందని, సద్వినియోగం చేసుకోవాలన్నారు. యువత వ్యసనాలకు దూరంగా ఉండాలన్నారు. గ్రామంలో యువతకు వాలీబాల్ కిట్ అందజేశారు.

క్రీడాకారులకు అభినందనలు



రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన అడ్డతీగల మండలం వేటమామిడి సచివాలయం క్రీడాకారులు



క్రికెట్ టోర్నీ విజత జట్టుకు నగదు బహుమతిని అందజేస్తున్న మండల పార్టీ కన్వీనర్ సత్తిబాబు

అడ్డతీగల: అల్లూరి జిల్లా పాడేరు కేంద్రంలో బుధవారం జరిగిన ఆడుదాం–ఆంధ్ర జిల్లా స్థాయి షటిల్ పోటీల్లో అడ్డతీగల మండలం వేటమామిడి సచివాలయం(మహిళలు) విభాగంలో విజయం సాధించి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. వేటమామిడి సచివాలయం తరపున షటిల్ పోటీల్లో చోడి రమాదేవి, ముర్ల మునీశ్వరి డబుల్స్ విభాగంలో విజయం సాధించి, రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్టు ఎంపీడీవో కె.బాపన్నదొర తెలిపారు. క్రీడాకారిణిలను పలువురు అభినందించారు.

వీఆర్ పురం: ఆడుదాం ఆంధ్రా రంపచోడవరం డివిజన్ క్రికెట్ టోర్నీ విజత జట్టుకు మండలంలోని పాపికొండల బోట్ యూనియన్ ఆధ్వర్యంలో రూ.10 వేల నగదు బహుమతిని అందచేశారు. వడ్డిగూడెం సచివాలయలో బుధవారం టీమ్ సభ్యులను వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ బోట్ యూనియన్ నాయకుడు మాదిరెడ్డి సత్తిబాబు సన్మానించి నగదును సభ్యులకు అందచేశారు. జిల్లా, రాష్ట్ర స్థాయి పోటీల్లో విజయం సాధించాలని ఆకాంక్షించారు. జేసీఎస్ మండల ఇన్‌చార్జ్ బొడ్డు సత్యనారాయణ, సుమన్ తదితరులు పాల్గొన్నారు.

రెండో టెస్ట్‌కు భారీ ఏర్పాట్లు

ఏసీఏ కార్యదర్శి గోపీనాథ్‌రెడ్డి



విశాఖ స్పోర్ట్స్: పీఎంపాలెంలోని వైఎస్ రాజశేఖరరెడ్డి ఏసీఏ–వీడీసీఏ స్టేడియం ముచ్చటగా మూడో టెస్ట్ మ్యాచ్.. ఆతిథ్యమిచ్చేందుకు సిద్ధమైంది. ఇక్కడ తొలిసారిగా ఇంగ్లండ్ జట్టు టెస్ట్ మ్యాచ్ ఆడగా.. మరోసారి ఆడేందుకు ఆ దేశ జట్టు వచ్చింది. ఆతిథ్య జట్టుకు అచ్చొచ్చిన స్టేడియంగా పేరొందిన ఈ స్టేడియంలో 2016లో ఇంగ్లండ్‌తో, 2019లో దక్షిణాఫ్రికాతో ఆడి విజయాలను సొంతం చేసుకుంది. ఆయా సిరీస్‌ల్లో తొలి విజయాలతో చక్కటి ఆరంభాన్ని వైఎస్సార్ స్టేడియం ఇచ్చింది. కాగా.. ఇంగ్లండ్ మ్యాచ్ అనగానే ఆ దేశం నుంచి మ్యాచ్‌ను తిలకించేందుకు భారీగా అభిమానులు తరలివస్తున్నారు. టూ టైర్ సిటింగ్ ఏర్పాట్లు ఉన్న స్టేడియంలో సౌత్, నార్త్ బ్లాక్‌ల్లో అభిమానులకు అనుమతిస్తున్నారు. విద్యార్థులు, క్రికెట్ క్లబ్‌ల తరఫున ఆడే ఔత్సాహికులకు ఏసీఏ ఉచితంగానే టికెట్లను అందించే ఏర్పాట్లు చేసింది. ఇంగ్లండ్ అభిమానుల భద్రత, మ్యాచ్ నిర్వహణ, ఏర్పాట్లు, టికెట్ల విక్రయాలు తదితర అంశాలను ఎస్ఆర్ గోపీనాథ్‌రెడ్డి బుధవారం 'సాక్షి'కి వివరించారు. ఈ వివరాలు ఆయన మాటల్లోనే..

ఇంగ్లండ్ అభిమానులకు ప్రత్యేక భద్రత

వైఎస్సార్ స్టేడియంలో రెండో టెస్ట్ మ్యాచ్ వీక్షించేందుకు ఇంగ్లండ్ అభిమానులు ఏకంగా మూడు బాక్స్‌ల టికెట్లను కొనుగోలు చేశారు. వారి భద్రతకు బ్రిటిష్ డిప్యూటీ హై కమిషనర్, నగర పోలీస్ కమిషనర్ రిక్కీ నిర్వహించి ఏర్పాట్లు సమీక్షించనున్నారు. వీరంతా వివిధ ప్రాంతాల్లో హోటళ్లను బుక్ చేసుకున్నారు. ఇక స్టేడియంలో వారికి ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు చేశాం. ఎండను తట్టుకునేందుకు వీలుగా సన్‌స్క్రీన్ లోషన్‌ను వారి వెంట తెచ్చుకునేందుకు వెసులుబాటు కల్పించాం.

మెరుగ్గా పారిశుధ్య నిర్వహణ

స్టేడియంలో కొత్తగా కమోడ్‌లు ఏర్పాటు చేశాం. డ్రైనేజ్‌ను ఆధునికీకరించాం. మ్యాచ్ జరిగేప్పుడు పారిశుధ్య నిర్వహణ కోసం బెంగళూరుకు చెందిన ప్రముఖ సంస్థకు అప్పగించాం. ఇందుకోసం ఓ అప్లికేషన్ రూపొందించాం. స్టేడియంలో ఎప్పుడు, ఎక్కడ ఎలాంటి పరిశుభ్రత జరుగుతుందనే విషయాన్ని పర్యవేక్షిస్తాం. మ్యాట్స్, టైల్స్ తదితరాలను శుభ్రంగా ఉంచే ఏర్పాట్లు జరిగాయి.

ఫోన్‌లో టికెట్ చూపిస్తే చాలు

దేశంలోనే తొలిసారిగా డిజిటల్ టికెటింగ్ వ్యవస్థను ఏర్పాటు చేశాం. కొనుగోలు చేసిన టికెట్ ను ఫోన్‌లో చూపించి ప్రవేశం పొందవచ్చు. ఆన్‌లైన్‌లో బుక్ చేసుకున్న వారు టికెట్ కోసం స్టేడియానికి రావాల్సిన అవసరం లేదు. లైన్‌లో వేచి ఉండక్కర్లేదు. దీనివల్ల పేపర్‌ను సేవ్ చేయవచ్చు. ఇటీవల జరిగిన టీ–20 మ్యాచ్‌కు ఈ విధానాన్ని అమలు చేద్దామని భావించాం. అయితే ట్రయల్‌రన్ నిర్వహిస్తే బాగుంటుందని ఇప్పుడు అమలు చేస్తున్నాం. లోటుపాట్లు ఉంటే సవరించుకుని.. సక్సెస్ అయితే ఇక డిజిటల్ టికెటింగ్‌కే ప్రాధాన్యమిస్తాం.

విద్యార్థులకు ఉచిత ప్రవేశం

ఐదు రోజుల పాటు జరిగే ఈ మ్యాచ్‌ను వీక్షించేందుకు ప్రతి రోజూ రెండు వేల మంది విద్యార్థులను ఉచితంగానే స్టేడియంలోకి అనుమతిస్తాం. అయితే విద్యార్థులు విద్యా సంస్థ ధ్రువీకరణతో రావాల్సి ఉంటుంది. మ్యాచ్ ప్రారంభానికి ముందే రావాలని లేదు. కాకుంటే నిర్ణయించిన సంఖ్య వరకు మాత్రమే ప్రవేశం ఉంటుంది. విజయనగరం, శ్రీకాకుళం, విశాఖ, ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాల్లోని సంఘ అనుబంధ క్లబ్‌లకు సంబంధించి ప్రతి రోజూ 2,850 మంది ఔత్సాహిక క్రికెటర్లకు ప్రవేశం కల్పించడానికి ఏర్పాట్లు చేశాం.

20 వేల టికెట్ల విక్రయం

టెస్ట్ మ్యాచ్‌ను వీక్షించేందుకు ఆన్‌లైన్‌లో 15 వేల టికెట్లు, కౌంటర్ల ద్వారా 5వేల టికెట్లు అమ్ముడుపోయాయి. స్టేడియం వద్ద ఆట చివరి రోజు వరకు కౌంటర్ ద్వారా టికెట్లను విక్రయించనున్నాం. శని, ఆదివారాల్లో అధిక సంఖ్యలో అభిమానులు రావచ్చని అంచనా వేస్తున్నాం. అభిమానులు తమ వాహనాలను కల్యాణ్‌కుమార్ పార్కింగ్ లేఅవుట్, బీ గ్రౌండ్‌లో ఏర్పాటు చేసిన స్థలంలో పార్కింగ్ చేసుకోవాలి. ఉచితంగా మంచినీటిని అందిస్తాం. స్టేడియంలో ఫుడ్‌స్టాళ్లు అందుబాటులో ఉంటాయి. స్టేడియంలోకి ఎలాంటి తినుబండారాలను అనుతించం. ఉదయం ఎనిమిది నుంచే స్టేడియంలోకి అనుమతిస్తాం. రోజుకు టికెట్ ధర కనీసం రూ.100 నుంచి గరిష్ట ధర రూ.500గా నిర్ణయించినట్లు గోపీనాథ్‌రెడ్డి వివరించారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు



ప్రమాదంలో కాలు విరిగిన జాగేంద్ర

ముంచంగిపుట్టు: మండల కేంద్రంలో నుంచి పెదబయలు వెళ్లే మార్గంలో కిలగాడ గ్రామ సమీపంలో బుధవారం ఎదురు ఎదురుగా వస్తున్న కారు, స్కూటీ ఢీకున్నాయి. ప్రమాదంలో స్కూటీతో వస్తున్న జాగేంద్రకు అనే వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు స్పందించి 108లో కిలగాడ పీహెచ్‌సీకి తరలించారు.వైద్యాధికారి శిరిషా వైద్య సేవలు అందించారు.జాగేంద్రకు ఎడమ కాళ్లు విరిగిపోయి, పరిస్థితి విషయంగా మారడంతో అంబులెన్స్‌లో పాడేరు జిల్లా ఆస్పత్రికి తరలించారు. జాగేంద్ర హర్యానాకు చెందిన వ్యక్తి కాగా, కొన్ని సంవత్సరాలుగా ముంచంగిపుట్టులో సమోసాల షాపు నిర్వహిస్తూ జీవనం కొనసాగిస్తున్నాడు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్‌ఐ రవీంద్ర అన్నారు.

రేపు డీసీసీబీ మహాజన సభ

విశాఖ విద్య: జిల్లా కేంద్ర సహకార బ్యాంకు 59వ మహాజన సభ ఈ నెల 2న మర్రిపాలెంలోని బ్యాంకు ప్రధాన కార్యాలయంలో జరగనుంది. ఈ మేరకు డీసీసీబీ అధికారులు తగిన ఏర్పాట్లు చేశారు. విశాఖపట్నం, అనకాపల్లి, అల్లూరి సీతారామరాజు జిల్లాల పరిధిలో 30 శాఖలు, వాటి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 98 ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల అధ్యక్షులు మహాసభకు హాజరుకానున్నారు. రైతాంగానికి మరింత మేలు చేసేలా.. భవిష్యత్‌లో కార్యకలాపాలను విస్తృతపరిచేలా మహాసభలో చర్చించనున్నట్లు బ్యాంకు సీఈవో వర్మ బుధవారం తెలిపారు.

వేడుకగా వైఎస్సార్ తీర్థం



ఏఎస్‌పేటలో జిల్లా స్థాయి గుర్రపు పరుగు పోటీలు



వైఎస్సార్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న భరత్‌కుమార్

కొంకోట: మండలంలోని ఏఎస్ పేట గ్రామంలో దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి తీర్థ మహోత్సవం బుధవారం ఘనంగా జరిగింది. ప్రధానంగా అనకాపల్లి, యలమంచిలి నియోజకవర్గ గ్రామాల నుంచి ప్రజలు తరలి వచ్చి ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా వైఎస్సార్ విగ్రహానికి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త మలసాల భరత్‌కుమార్, పార్టీ మండలాధ్యక్షుడు మలసాల కిషోర్ పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. మధ్యాహ్నం భారీ అన్న సమారాధన నిర్వహించారు. సాయంత్రం తీర్థ మహోత్సవం జరిగింది. పిల్లల ఆట వస్తువులు, మహిళల అలంకరణ వస్తువులు, తిను బండారాల అమ్మకాలు జోరుగా సాగాయి. ఉత్సవంలో మహిళలు కోలాటాలు ప్రదర్శించారు. బుర్రకథ, టీవీ కళాకారులతో నిర్వహించిన డ్యాన్స్ కార్యక్రమాలు నిర్వహించారు. వైఎస్సార్ తీర్థంలో నిర్వహించిన జిల్లా స్థాయి గుర్రపు పరుగు పోటీల్లో అచ్యుతాపురం మండలం రామన్నపాలేనికి చెందిన చోడమాంబిక విక్రం గుర్రం ప్రథమ బహుమతిని గెలుచుకుంది. వైఎస్సార్ సీపీ నియోజకవర్గ సమన్వయకర్త భరత్‌కుమార్ పోటీలను జెండా ఊపి ప్రారంభించారు. చోడవరానికి చెందిన దాడి నూక హనుమంతరావు గుర్రం ద్వితీయ, సింగపూర్ సత్యనారాయణకు చెందిన గుర్రం తృతీయ, ఆయనకే చెందిన మరో గుర్రం చతుర్థ బహుమతులను గెలుచుకున్నాయి. సుమారు 15 గుర్రాలు పోటీలో పాల్గొన్నాయి.

పలు రైళ్లకు అదనపు కోచ్‌లు

తాటిచెట్లపాలెం : ప్రయాణికుల రద్దీని తగ్గించేందుకు వెయిటింగ్ లిస్ట్ ప్రయాణికుల కోసం పలు రైళ్లకు అదనపు కోచ్‌లను జతచేస్తున్నట్లు వాల్తేర్ డివిజన్ సీనియర్ డివిజనల్ కమర్షియల్ మేనేజర్ త్రిపాఠి తెలిపారు.

1)భువనేశ్వర్–బెంగళూరు(12845) సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్‌కు ఈ నెల 4 నుంచి 25వ తేదీ వరకు, తిరుగు ప్రయాణంలో ఎస్ఎంవీ బెంగళూరు–భువనేశ్వర్(12846) సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్‌కు ఈ నెల 5 నుంచి 26వ తేదీ వరకు ఒక థర్డ్ ఏసీ కోచ్‌ను జతచేస్తున్నారు.

2)భువనేశ్వర్–చెన్నై సెంట్రల్(12830) సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్‌కు ఈ నెల 1వ తేదీ నుంచి 29వ తేదీ వరకు, తిరుగు ప్రయాణంలో చెన్నై సెంట్రల్–భువనేశ్వర్(12829) సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్‌కు ఈ నెల 2వ తేదీ నుంచి మార్చి 1వ తేదీ వరకు ఒక థర్డ్ ఏసీ కోచ్‌ను జతచేస్తున్నారు.

3)భువనేశ్వర్–తిరుపతి(22871) సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్‌కు ఈ నెల 4వ తేదీ నుంచి 25వ తేదీ వరకు, తిరుగు ప్రయాణంలో తిరుపతి–భువనేశ్వర్(22872) సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్‌కు ఈ నెల 5వ తేదీ నుంచి 26వ తేదీ వరకు ఒక థర్డ్ ఏసీ కోచ్‌ను జతచేస్తున్నారు.

4)భువనేశ్వర్–పుణే (22882) సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్‌కు ఈ నెల 6వ తేదీ నుంచి 27వ తేదీ వరకు, తిరుగు ప్రయాణంలో పుణే–భువనేశ్వర్(22881) సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్‌కు ఈ నెల 8వ తేదీ నుంచి 29వ తేదీ వరకు ఒక థర్డ్ ఏసీ కోచ్‌ను జతచేస్తున్నారు.

5)సంబల్‌పూర్–నాందేడ్(20809) నాగావళి ఎక్స్‌ప్రెస్‌కు ఈ నెల 2వ తేదీ నుంచి 26వ తేదీ వరకు, తిరుగు ప్రయాణంలో నాందేడ్ –సంబల్‌పూర్(20810) నాగావళి ఎక్స్‌ప్రెస్‌కు ఈ నెల 3వ తేదీ నుంచి 27వ తేదీ వరకు ఒక థర్డ్ ఏసీ, ఒక స్లీపర్ క్లాస్ కోచ్‌ను జతచేస్తున్నారు.